సాక్షి మంచిర్యాల

మంగళవారం, 3, సెప్టెంబర్, 2024



'ఇన్‌స్పైర్ చేయండి'

విద్యార్థుల్లో సృజనాత్మకతను పెంపొందించేలా ఇన్‌స్పైర్ మనక్ పేరిట దరఖాస్తులు ఆహ్వానిస్తోంది. ఈ నెల 15వరకు తుది గడువు కాగా.. దరఖాస్తుల్లో మంచిర్యాల ముందుంది. 8లో▸



ఎందుకు బిడ్డా.. ఇంతపని చేసుకున్నరు..!

భార్య, ఇద్దరు పిల్లలకు విషమించి భర్త ఆత్మ హత్య చేసుకున్న ఘటనలో వారి మృతదేహాలను మంచిర్యాలకు తరలించారు. 8లో▸

వాతావరణం

గరిష్టం/కనిష్టం 28.0 /25.0

మధ్యాహ్నం నుంచి చిరుజల్లులతో కూడిన వర్షం కురిసే అవకాశం ఉంది. నైరుతి దిశగా ఈదురుగాలులు బలంగా వీస్తాయి.

న్యూస్‌రీల్

ఘనంగా వైఎస్సార్ వర్ధంతి



నివాళులర్పిస్తున్న కాంగ్రెస్ పార్టీ నాయకులు

పాతమంచిర్యాల: దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్.రాజశేఖరరెడ్డి వర్ధంతిని సోమవారం జిల్లా కేంద్రంలోని చార్వాక ట్రస్టు భవన్‌లో కాంగ్రెస్ పార్టీ సేవాదళ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డాక్టర్ నీలకంఠేశ్వర్‌రావు ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. వైఎస్సార్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా డాక్టర్ నీలకంఠేశ్వర్‌రావు మాట్లాడుతూ రైతులకు 9 గంటలు ఉచిత కరెంటు, ఆరోగ్యశ్రీ, 104అంబులెన్సు సర్వీస్, విద్యార్థులకు ఫీజు రీయింబర్స్‌మెంటు, జలయజ్ఞం ద్వారా ప్రాజెక్టుల నిర్మాణం వైఎస్సార్ ప్రారంభించారని అన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు జాడి నర్సయ్య, పలిగిరి కనకరాజు, మారుపల్లి రాజయ్య, కామెర క్రాంతి, పి.చంద్రమోహన్, సంజీవ్, సోము, రవీందర్, మనోజ్, మహేష్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా పొలాల అమావాస్య



ఎడ్లకు పూజలు చేస్తున్న రైతు కుటుంబం

నెన్నెల: మండల వ్యాప్తంగా పొలాల అమావాస్య పండుగను సోమవారం ఘనంగా నిర్వహించారు. ఎడ్లను శుభ్రంగా కడిగి జంజేరు పూలు, పత్రి ఆకులతో అలంకరించి ముస్తాబు చేశారు. మట్టితో చేసిన ఎద్దుల ప్రతిమలను పూజించారు. ఎడ్లకు పిండివంటకాల నైవేద్యాలను తినిపించి పూజలు చేశారు. సాయంత్రం హనుమాన్ ఆలయం చుట్టూ ఎద్దులతో ప్రదక్షిణలు చేయించారు. పండుగను మూడు రోజుల పాటు నేతకాని కులస్తులు నిర్వహిస్తారు.

బొగ్గు ఉత్పత్తికి విఘాతం

శ్రీరాంపూర్: వర్షం వల్ల శ్రీరాంపూర్ ఓపెన్ కాస్ట్ గనుల్లో బొగ్గు ఉత్పత్తికి విఘాతం కలిగింది. మూడు రోజులుగా కురుస్తున్న వర్షాల వల్ల శ్రీరాంపూర్ ఓపెన్ కాస్ట్‌లో రోజుకు 3500 టన్నుల చొప్పున బొగ్గు ఉత్పత్తికి విఘాతం ఏర్పడింది. ఓసీపీలో మైనింగ్ కార్యకలాపాలు పూర్తిగా నిలిచిపోయాయి. ఓబీ పనులు కూడా ఆగిపోయాయి. దీంతో రోజుకు 70 వేల క్యూబిక్ మీటర్ల మట్టి వెలికితీత పనులు నిలిచిపోయాయి. వర్షం వల్ల బొగ్గు రాకపోవడంతో ఉపరితలంలో ఉన్న స్టాక్ కోల్‌ను లిఫ్ట్ చేసి జైపూర్ ఎస్‌టీపీపీకి రవాణా చేస్తున్నారు.

కులగణన చేపట్టాలని వినతి



కలెక్టర్‌కు వినతిపత్రం ఇస్తున్న నాయకులు

మంచిర్యాలఅగ్రికల్చర్: ఇచ్చిన మాట ప్రకారం కాంగ్రెస్ ప్రభుత్వం కులగణన చేపట్టాలని, బీసీ రిజర్వేషన్లు పెంచాలని బీసీ సంఘాల ఆధ్వర్యంలో సోమవారం జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్‌కు వినతిపత్రం అందజేశారు. బీసీ సంఘ నాయకులు మాట్లాడుతూ తక్షణమే సమగ్ర కులగణన చేపట్టాలని, స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు రిజర్వేషన్లు 42శాతానికి పెంచాలని, ఆ తర్వాతనే ఎన్నికలు నిర్వహించాలని పేర్కొన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చేపట్టబోయే జాతి జనగణనలో బీసీ కులగణన చేపట్టి రాజ్యాంగబద్ధమైన హక్కులు కల్పించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో బీసీ సంఘ నాయకులు చంద్రమోహన్ పాల్గొన్నారు.

మత్తడి దూకుతున్న గొల్లవాగు ప్రాజెక్ట్



గొల్లవాగు ప్రాజెక్ట్

భీమారం: భీమారం సమీపంలోని గొల్లవాగు ప్రాజెక్ట్‌లోకి పెద్ద ఎత్తున వరద నీరు వచ్చి చేరుతుండడంతో సోమవారం మత్తడి దూకింది. వర్షాలు సమృద్ధిగా లేకపోవడంతో ప్రాజెక్ట్ చాలా ఆలస్యంగా నిండింది. ప్రాజెక్ట్ నీటి సామర్థ్యం 155.50 మీటర్లు కాగా సోమవారం నాటికి 155.60 చేరింది. ఇరిగేషన్ శాఖ చీఫ్ ఇంజినీరు శ్రీనివాస్ ప్రాజెక్టును సందర్శించారు. రైతులకు సాగునీరు అందించేందుకు ఏర్పాట్లు చేయనున్నట్లు తెలిపారు. ఇరిగేషన్ ఎస్ఈ విష్ణుప్రసాద్, డీఈ ప్రవీణ్‌కుమార్, ఏఈఈ శ్యాంరెడ్డి పాల్గొన్నారు.

వణికిస్తున్న వరద..!



రాళ్లవాగులో వరద

- 'ఎల్లంపల్లి', 'కడెం' గేట్లు ఎత్తితే భయం
- లక్షల క్యూసెక్కుల నీరు గోదావరిలోకి..
- ఎంసీహెచ్‌ను ఖాళీ చేయించిన అధికారులు
- లోతట్టు ప్రాంత ప్రజలకు తప్పని తిప్పలు

సాక్షి ప్రతినిధి, మంచిర్యాల: గోదావరి నది వరద మంచిర్యాల, నస్పూర్ పట్టణాల లోతట్టు ప్రాంత ప్రజలను వణికిస్తోంది. ఏటా వానాకాలంలో 'ఎల్లంపల్లి', కడెం, ప్రాజెక్టుల గేట్లు ఎత్తితే లోతట్టు కాలనీకు నీరు చేరుతుందనే భయం వెంటాడుతోంది. గత జూలై, ఆగస్టులో వర్షాలకు 'ఎల్లంపల్లి' గేట్లు ఎత్తే అవకాశం రాకపోవడంతో గోదావరిలో నీటి ప్రవాహం లేదు. గత మూడు రోజులుగా కురుస్తున్న వర్షాలు, ఎగువన ఎస్సారెస్పీ గేట్లు ఎత్తి నీటిని విడుదల చేయడం, కడెం ప్రాజెక్టు నుంచి భారీగా వరద వస్తున్న నేపథ్యంలో జిల్లా కేంద్రంలోని ముంపు కాలనీలైన ఎన్టీఆర్, ఎల్ఐసీ, రాంనగర్, రాళ్లవాగు ఆనుకుని ఉన్న కాలనీలు, పాత మంచిర్యాల, కాలేజీ రోడ్, మాతాశిశు సంరక్షణ కేంద్రం, నస్పూర్ పట్టణం వినూత్న కాలనీల ప్రజలు అప్రమత్తంగా ఉండాల్సి వస్తోంది. రెండేళ్ల క్రితం గతంలో ఎన్నడూ లేనంతగా వర్షాలు కురువడంతో పట్టణంలో చాలా కాలనీలకు వరద నీరు చేరింది. ఇళ్లలో ఉన్న రూ.లక్షల విలువైన సామగ్రి నీటి పాలయ్యాయి. అనేకమంది ఆర్థికంగా చాలా నష్టపోయారు. ఈ సీజన్‌లో ఇప్పటికీ గోదావరిలో భారీగా ప్రవాహం లేకపోవడంతో ముప్పు ఏర్పడలేదు.

బ్యాక్ వాటర్ భయం

ఎల్లంపల్లి ప్రాజెక్టు పూర్తి సామర్థ్యం 20టీఎంసీలు కాగా.. మొత్తం 62గేట్లు ఉన్నాయి. ప్రస్తుతం 32గేట్లు ఎత్తి 2.80లక్షల క్యూసెక్కుల వరకు నీటిని విడుదల చేస్తున్నారు. ఎస్సారెస్పీ నుంచి పూర్తి స్థాయిలో నీటిని విడుదల చేస్తే రెండు లక్షల నుంచి పది లక్షల క్యూసెక్కుల దాకా నీటిని విడుదల చేసే అవకాశం ఉంది. ఆ స్థాయిలో నీళ్లు వస్తే సుందిళ్ల, అన్నారం, మేడిగడ్డ బ్యారేజీల్లోనూ నీటిని కిందకు వదలాలి. ఆ బ్యారేజీల్లో గేట్లు ఎత్తడం జాప్యం జరిగితే నీరు బ్యాక్ వాటర్‌గా వెనక్కి వస్తున్నాయి. దీంతో మంచిర్యాల పట్టణం నుంచి గోదావరిలో కలిసే రాళ్లవాగు, తోళ్లవాగు నీరు ఎక్కడికక్కడ నిలిచిపోయి, లోతట్టు ప్రాంతాలకు నీరు చేరుతోంది. ఇక గోదావరి ఒడ్డున ఉన్న పంట పొలాలు, కాలనీలు నీట మునిగిపోతున్నాయి. ఇక్కడే కాకుండా ర్యాలీవాగుతోనూ వెంపల్లి దాకా ప్రభావం చూపిస్తోంది. ఈ క్రమంలో ఏటా వానాకాలంలో అప్రమత్తంగా ఉండాల్సి వస్తోంది. ప్రస్తుతం పరిస్థితిని ఎప్పటికప్పుడు అంచనా వేస్తున్నారు. ఎమ్మెల్యే ప్రేమ్‌సాగర్‌రావు లోతట్టు ప్రాంతాల్లో పర్యటిస్తూ కాలనీ వాసులకు భరోసా కల్పించారు. కలెక్టర్ సాగునీటి అధికారులతో నిరంతరం సమీక్షిస్తున్నారు. ఎల్లపల్లి వరద ఉధృతిపై అప్రమత్తంగా ఉంటున్నారు. కడెం ప్రాజెక్టు నుంచి వరద 40వేల క్యూసెక్కులకు తగ్గింది.

శాశ్వత పరష్కారమెప్పుడు?

మంచిర్యాల పట్టణంతోపాటు గోదావరి తీర ప్రాంతాలు నీట మునగకుండా శాశ్వత పరిష్కారంపై డిమాండ్ చేస్తున్నారు. గోదావరి, రాళ్లవాగుకు ప్రొటెక్షన్ వాల్(రక్షణ గోడ) కట్టేందుకు ఈ ఏడాది రాష్ట్ర బడ్జెట్‌లో రూ.348కోట్లు ప్రతిపాదించారు. దీంతో ముంపు ప్రాంతాల వాసులకు ఊరట కలిగింది. గోడ నిర్మాణంపై ఇప్పటికీ పూర్తిస్థాయిలో ముందడు గు పడలేదు. త్వరితగతిన రక్షణ గోడ నిర్మిస్తే పట్ట ణానికి వరద ముప్పు తప్పే అవకాశం ఉంది.



ఎల్లంపల్లి గేట్లు ఎత్తడంతో దిగువకు వరద



ప్రజలతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే ప్రేంసాగర్‌రావు

'ఎంసీహెచ్'లో అదే గోస



గర్భిణులు, బాలింతలు, శిశువుల తరలింపు

గోదావరి ఒడ్డున ఉన్న మాతాశిశు సంరక్షణ కేంద్రం(ఎంసీహెచ్) ఏటా వరద ముంపులో మొదటి వరసలో ఉంటోంది. రెండేళ్ల క్రితం భవనం దాదాపు నీట మునిగింది. రూ.లక్షల ఆస్తి నష్టం జరిగింది. ఆ సమయంలో చికిత్స పొందుతున్న గర్భిణులు, బాలింతలు, నవజాత శిశువులను రాత్రివేళ తరలించాల్సి వచ్చింది. తాజాగా సోమవారం ముందు జాగ్రత్తగా గర్భిణులు, బాలింతలు, నవజాత శిశువులు 130మందిని ప్రభుత్వ, ప్రైవేటు ఆస్పత్రులకు తరలించారు. మందులు అందజేస్తామని డీఎంహెచ్‌వో హరీష్‌రావు తెలిపారు. మళ్లీ వర్షాలు తగ్గే వరకు ఎంసీహెచ్ వినియోగంలోకి రాదు. జిల్లా ఆసుపత్రిలో అరకొర సౌకర్యాలు ఉండడంతో గర్భిణులు అరిగోస పడాల్సి వస్తోంది. ఎంసీహెచ్‌ను ఐబీ ఆవరణలోకి మార్చాలనే ప్రతిపాదనలు ఉన్నాయి. అప్పటిదాకా వర్షాకాలంలో చికిత్స పొందే వారికి తిప్పలు తప్పేలా లేవు.





రాళ్లవాగులో పాత వంతెనపై నుంచి వరదనీరు

ప్రజలు ఆందోళన చెందవద్దు

- విస్తృతంగా ముందస్తు జాగ్రత్త చర్యలు చేపట్టాం
- జిల్లా కలెక్టర్ కుమార్‌దీపక్, ఎమ్మెల్యే ప్రేమ్‌సాగర్‌రావు



ప్రాజెక్ట్‌ను సందర్శిస్తున్న కలెక్టర్, ఎమ్మెల్యే, డీసీపీ

మంచిర్యాలరూరల్(హాజీపూర్): భారీ వర్షాల నేపథ్యంలో ప్రజలు ఎలాంటి ఆందోళన చెందాల్సిన అవసరం లేదని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్, మంచిర్యాల ఎమ్మెల్యే కొక్కిరాల ప్రేమ్‌సాగర్‌రావు అన్నారు. సోమవారం హాజీపూర్ మండలం గుడిపేట శివారులోని ఎల్లంపల్లి ప్రాజెక్ట్‌ను కలెక్టర్ కుమార్ దీపక్, ఎమ్మెల్యే ప్రేమ్‌సాగర్‌రావు మంచిర్యాల డీసీపీ ఏ.భాస్కర్, ఏసీపీ ప్రకాశ్, ప్రాజెక్ట్ అధికారులతో కలిసి సందర్శించారు. ప్రాజెక్ట్‌లోకి వరద నీటిపై అధికారుల ద్వారా సమీక్షించారు. కలెక్టర్ కుమార్‌దీపక్ మాట్లాడుతూ జిల్లా అధికార యంత్రాంగం అందుబాటులో ఉందని, వరదలు, వర్షాలకు సంబంధించి అత్యవసర సేవలకు కంట్రోల్ రూం నంబర్ 08736–250501లో సంప్రదించాలని తెలిపారు. ఎమ్మెల్యే ప్రేమ్‌సాగర్‌రావు మాట్లాడుతూ జిల్లా అధికార యంత్రాంగం ప్రజల రక్షణ దిశగా కృషి చేస్తోందని తెలిపారు. ముందస్తు జాగ్రత్త చర్యల్లో భాగంగా జిల్లా కేంద్రంలోని మాతాశిశు ఆస్పత్రి నుంచి రోగులను ప్రభుత్వ ఆస్పత్రికి తరలించామని అన్నారు. ఎల్లంపల్లి ఈఈ స్వామి, డీఈఈలు శరత్‌బాబు, బుచ్చిబాబు, హాజీపూర్ తహసీల్దార్ శ్రీనివాసరావుదేశ్‌పాండే, ఎంపీడీఓ మధుసూదన్, హాజీపూర్ ఎస్సై గోపతి సురేశ్ పాల్గొన్నారు.

కొనసాగుతున్న 'ఎల్లంపల్లి' గేట్ల ఎత్తివేత

మంచిర్యాలరూరల్(హాజీపూర్): ఎల్లంపల్లి ప్రాజెక్ట్ గేట్ల ఎత్తివేత కొనసాగుతోంది. భారీ వర్షాలతోపాటు ఎగువ ప్రాంతాల నుంచి భారీగా వరద నీరు ప్రాజెక్ట్‌లోకి చేరుతుండడంతో దిగువకు నిర్విరామంగా వదులుతున్నారు. దీంతో ఏకంగా 18 టీఎంసీలకు పైగా ఉన్న ప్రాజెక్ట్ నీటిమట్టం గేట్ల ఎత్తివేతతో 14 టీఎంసీలకు పడిపోయింది. ప్రాజెక్ట్ పూర్తి నీటిమట్టం 20.175 టీఎంసీలకు గాను 14టీఎంసీల నీటిమట్టంతో ఉంది. కడెం ప్రాజెక్ట్ నుంచి 14 వేల క్యూసెక్కులు, ఎగువ ప్రాంతాల నుంచి 2.80 లక్షల క్యూ సెక్కులు వరద వస్తోంది. హైదరాబాద్ మెట్రో వాటర్ వర్క్స్ పథకానికి 331 క్యూసెక్కులు, 32 గేట్లు ఎత్తి 2.65 లక్షల క్యూసెక్కుల నీటిని గోదావరిలోకి విడుదల చేస్తున్నారు. ప్రాజెక్ట్‌పై రాకపోకలు నిషేధించారు.

అదే జోరు వాన



భీమిని మండలంలో వరదలో మునిగిన పత్తి పంట

- మూడో రోజూ తెరిపినివ్వని వర్షం
- పొంగిపొర్లుతున్న వాగులు, ఒర్రెలు
- మత్తడి దూకుతున్న చెరువులు, కుంటలు
- నీట మునుగుతున్న పత్తి పంట

మంచిర్యాలఅగ్రికల్చర్: బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడన ప్రభావంతో జిల్లా వ్యాప్తంగా మూడు రోజులుగా కురుస్తున్న వర్షం తెరిపినివ్వడం లేదు. ఆదివారం రాత్రి నుంచి సోమవారం వరకు భారీ వర్షం కురిసింది. 55మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది. అత్యధికంగా దండేపల్లి, బెల్లంపల్లి, జన్నారం, కాసిపేట మండలాల్లో 70నుంచి 100 మిల్లీమీటర్ల వర్షం కురిసింది. వాగులు, వంకలు, ఒర్రెలు ఉధృతంగా ప్రవహిస్తుండగా.. చెరువులు, కుంటలు అలుగు దూకుతున్నాయి. ఎగువ ప్రాంతంలో కురుస్తున్న వర్షాలతో గోదావరి, ప్రాణహిత నదులు ఉధృతంగా ప్రవహిస్తున్నాయి. ర్యాలీవాగు, గొల్లవాగు, నీల్వాయి ప్రాజెక్టుల్లోకి నీటి ప్రవాహం పెరిగింది. కడెం ప్రాజెక్టు గేట్లు ఎత్తడంతో భారీగా వస్తున్న వరద ప్రభావంతో ఎల్లంపల్లి ప్రాజెక్టు 34గేట్లు ఎత్తారు. దీంతో లక్షల క్యూసెక్కుల నీరు గోదావరిలోకి వెళ్తోంది. లోతట్టు ప్రాంతాల్లోని పత్తి పంట నీట మునిగి ఇసుక మేటలు వేశాయి. వరి పొలాలు చెరువులను తలపిస్తున్నాయి. జన్నారం మండలం కవ్వాల్, కొత్తపేట్, కోమనపల్లి, ధర్మారం, చెన్నూర్ మండలం సుదరశాలలో వ్యవసాయ అధికారులు ప్రాథమిక అంచనా వేసి 115మంది రైతులకు చెందిన 186 ఎకరాల్లో పత్తి, వరి పంటలకు నష్టం వాటిల్లినట్లు గుర్తించారు. వివిధ ప్రాంతాల్లో వాగులు పొంగి కాజ్‌వే, రోడ్లపై నుంచి వరద నీరు ప్రవహిస్తుండడంతో రాకపోకలు నిలిచిపోయాయి. పలు గ్రామాల్లో రోడ్లు దెబ్బతిన్నాయి. లోతట్టు ప్రాంతాల్లోని కాలనీల్లో వరద నీరు చేరడంతో కాలనీవాసులు ఇబ్బందులు పడ్డారు. జన్నారం మండలంలో విద్యుత్ వైర్లపై చెట్లు విరిగిపడడంతో రెండు స్తంభాలు, చెన్నూర్ మండలం కిష్టంపేటలో ఒక స్తంభం నేలకూలి విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడింది. వెంటనే మరమ్మతులు చేపట్టి విద్యుత్ సరఫరా పునరుద్ధరించారు. సింగరేణి ఉపరితల గనుల్లో భారీ వర్షంతో ఉత్పత్తికి అంతరాయం ఏర్పడి నష్టం వాటిల్లింది.

పంట నష్టం

మండలం	పత్తి	వరి	రైతులు
జన్నారం	15	71 ఎకరాలు	85
చెన్నూర్	100	0	30

జిల్లాలో 55 మిల్లీమీటర్ల వర్షం

దండేపల్లి మండలంలో 99.1 మిల్లీమీటర్లు, బెల్లంపల్లిలో 94.4, జన్నారంలో 76.5, కాసిపేటలో 73.9, చెన్నూర్‌లో 65.2, నస్పూర్‌లో 62.3, భీమారంలో 60.7, భీమినిలో 51.6, మందమర్రిలో 49.8, నెన్నెలలో 48.8, జైపూర్‌లో 45.2, కోటపల్లిలో 40.3, మంచిర్యాలలో 39.8, లక్సెట్టిపేటలో 39, తాండూర్‌లో 38.1, కన్నెపల్లిలో 33.7, వేమనపల్లిలో 25.2 మిల్లీమీటర్ల వర్షం కురిసింది. జిల్లా సాధారణ వర్షపాతం 784.5 మిల్లీమీటర్లు కురవాల్సి ఉండగా.. 839.7 మిల్లీమీటర్లు న మోదైంది. జిల్లా సగటున 7 శాతం అధికంగా కురిసింది.

కాంట్రాక్ట్ కార్మికుల సమ్మె



కేకే ఓసీపీలో నిలిచిపోయిన వాహనాలు

- సంస్థకు భారీగా నష్టం
- మూడ్రోజుల్లో బొగ్గు ఉత్పత్తి పనులకు బ్రేక్

మందమర్రిరూరల్: మందమర్రి ఏరియాకు సింగరేణి సంస్థ కేటాయించిన బొగ్గు ఉత్పత్తి లక్ష్య సాధనలో కీలకంగా ఉన్న కేకే–ఓసీలో ఆగస్టు 21నుంచి ఓబీ కాంట్రాక్టు కార్మికుల సమ్మె వల్ల సంస్థకు భారీగా నష్టం వాటిల్లుతోంది. ఓసీలో తీయాల్సిన మట్టి తీత పనులు నిలిచిపోవడంతో బొగ్గు ఉత్పత్తికి కూడా ఆటంకం ఏర్పడనుంది. రోజుకు ఆరు వేల టన్నుల బొగ్గు ఉత్పత్తి చేయాల్సి ఉండగా.. ప్రస్తుత పరిస్థితుల్లో సుమారు వెయ్యి టన్నుల వరకు ఉత్పత్తి చేస్తున్నట్లు తెలుస్తోంది. దీంతో యాజమాన్యం కాంట్రాక్టర్‌తో చర్చించినా ఫలితం కనిపించడం లేదు. కేకే–ఓసీలో మట్టితీత పనుల కోసం నాలుగేళ్ల ఒప్పందంతో ఆర్వీఆర్ సాయి ప్రణవ్ అనే సంస్థ అక్టోబర్ 2020లో కాంట్రాక్టు దక్కించుకుంది. అక్టోబర్ 2024వరకు ఒప్పందం ప్రకారం 886 లక్షల క్యూబిక్ మీటర్ల మట్టి తీత పనులకు ఒప్పందం చేసుకుంది. రోజుకు సుమారు 60వేల క్యూబిక్ మీటర్ల మట్టి వెలికి తీస్తే సింగరేణి సంస్థ ఆరు వేల టన్నుల బొగ్గు ఉత్పత్తి చేయడానికి ఆస్కారం ఉంటుంది. వాతావరణం అనుకూలించక, నిబంధనల ప్రకారం పనులు జరగకపోవడం, ఇతర కారణాల వల్ల కాంట్రాక్టర్‌కు యాజమాన్యం సుమారు రూ.7కోట్ల పైచిలుకు జరిమానా విధించినట్లు సమాచారం. కాంట్రాక్టర్ జరిమానా చెల్లించలేదు. రావాల్సిన బిల్లుల కోసం ఇండెంట్ పంపిస్తే యాజమాన్యం జరిమానా కోత విధించుకుని చెల్లిస్తుందేమోనని జూన్, జూలై మాసాల బిల్లులకు కాంట్రాక్టర్ దరఖాస్తు కూడా చేసుకోలేదు. కార్మికులకు వేతనాలూ చెల్లించలేదు. కాంట్రాక్టు గడువు సమీపిస్తుండగా.. మరో ఏడెనిమిది నెలలు కాంట్రాక్టు పొడగింపు కోసం కాంట్రాక్టర్ కోర్టుకు వెళ్లినట్లు సమాచారం. కాగా, యాజమాన్యం కాంట్రాక్టర్ నిర్లక్ష్యాన్ని తీవ్రంగా పరిగణిస్తోందని ఓ ఉన్నతాధికారి తెలిపారు. కాంట్రాక్టర్ రెండు నెలలుగా వేతనాలు చెల్లించకపోవడంతో 450మంది కాంట్రాక్టు కార్మికులు గత నెల 21 నుంచి సమ్మె చేస్తున్నారు.

ఉత్పత్తికి ఆటంకం

మట్టితీత పనుల కార్మికుల సమ్మెతో బొగ్గు ఉత్పత్తికి ఆటంకం కలుగుతోంది. నిర్దేశిత ఉత్పత్తి లక్ష్యంలో ఐదు వేల టన్నుల ఉత్పత్తికి ఆటంకం ఏర్పడుతోంది. ఇంకా రెండు మూడు రోజుల వరకే ఆ బొగ్గు తీత పనులు జరిగే అవకాశం ఉందని సమాచారం. సమ్మె విషయమై మందమర్రి ఏరియా జీఎం జీ.దేవేందర్‌ను సంప్రదించగా.. కాంట్రాక్టర్‌తో చర్చలు జరుగుతున్నాయని, రెండు మూడు రోజుల్లో వేతనాలు చెల్లించి కార్మికులు విధుల్లో చేరే ప్రయత్నం చేస్తున్నామని కాంట్రాక్టర్ తెలిపారని అన్నారు. లేని పక్షంలో యాజమాన్యం బొగ్గు తీయడానికి ప్రత్యామ్నాయంగా ఏర్పాట్లు చేస్తున్నారు.

విద్యార్థులకు పఠనంపై ఆసక్తి పెంచాలి

- జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్

మంచిర్యాలఅగ్రికల్చర్: విద్యార్థులకు ప్రాథమిక దశలోనే పుస్తక పఠనంపై ఆసక్తి పెంచాలని కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. సోమవారం కలెక్టరేట్ ఆవరణలో జిల్లా అదనపు కలెక్టర్ మోతిలాల్, డీఈవో యాదయ్యలతో కలిసి రూమ్ టు రీడ్ ఇండియా ట్రస్టు ద్వారా ఏర్పాటు చేసిన సంచార గ్రంథాలయ వాహనాన్ని జెండా ఊపి ప్రారంభించారు. కలెక్టర్ మాట్లాడుతూ ప్రతీ విద్యా సంవత్సరం ఆగస్టు 15 నుంచి సెప్టెంబర్ 8 వరకు పాఠశాల విద్యాశాఖ సమన్వయంతో రాష్ట్ర స్థాయి రీడింగ్ క్యాంపెయిన్ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో లీడ్ బ్యాంక్ జిల్లా మేనేజర్ తిరుపతి, జిల్లా వయోజన విద్యాధికారి పురుషోత్తం నాయక్, సమగ్ర శిక్షణ సమన్వయకర్తలు కే.చౌదరి, ఏ.సత్యనారాయణమూర్తి, రూమ్ టు రీడ్ ఇండియా ప్రతినిధులు మధు, తదితరులు పాల్గొన్నారు.



జెండా ఊపి వాహనాన్ని ప్రారంభిస్తున్న కలెక్టర్ కుమార్ దీపక్

అభివృద్ధి పనులు పూర్తి చేయాలి

మంచిర్యాలఅగ్రికల్చర్: కార్పొరేట్ సామాజిక బాధ్యత కింద జిల్లాలో చేపట్టిన అభివృద్ధి పనులు త్వరితగతిన పూర్తి చేయాలని కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. సోమవారం కలెక్టరేట్‌లో ముఖ్య ప్రణాళిక అధికారి ఎండీ ఖాసీం, స్టాటిస్టిక్ అధికారి సత్యం, సింగరేణి అధికారులతో జిల్లాలో కార్పొరేట్ సామాజిక బాధ్యత కింద చేపట్టిన అభివృద్ధి పనుల పురోగతిపై సమీక్ష సమావేశం నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో చేపట్టిన అభివృద్ధి పనులను డిసెంబర్ వరకు పూర్తి చేయాలని తెలిపారు.

ఏరియా ఆస్పత్రిని సందర్శించిన కలెక్టర్



వైద్యులతో మాట్లాడుతున్న కలెక్టర్

రామకృష్ణాపూర్: రామకృష్ణాపూర్‌లోని సింగరేణి ఏరియా ఆస్పత్రిని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ సోమవారం సందర్శించారు. వరద పరిస్థితుల దృష్ట్యా జిల్లా కేంద్రంలోని మాతాశిశు ఆసుపత్రి నుంచి రోగులకు ప్రత్యామ్నాయంగా సేవలు అందించేందుకు ప్రభుత్వ ఆసుపత్రికి తరలిస్తున్నామని, అక్కడ సరిపడా పడకలు లేనిపక్షంలో ఆర్‌కేపీ సింగరేణి ఏరియా ఆస్పత్రిని వినియోగించుకుంటామని సింగరేణి సీఎండీ బలరాంనాయక్‌ను ఫోన్ ద్వారా కోరారు. దీనికి ఆయన సానుకూలంగా స్పందించారు. కాగా ఏరియా ఆసుపత్రిలో ప్రస్తుతం 70 పడకలు అందుబాటులో ఉన్నాయని ఆసుపత్రి సిబ్బంది కలెక్టర్ దృష్టికి తీసుకువచ్చారు. క్యాతనపల్లి మున్సిపల్ చైర్‌పర్సన్ జంగం కళ, కమిషనర్ మురళీకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ఒడ్డెపల్లిని సందర్శించిన ఎమ్మెల్యే

చెన్నూర్: చెన్నూర్ మున్సిపాలిటీ పరిధి ఒడ్డెపల్లి కాలనీని ఎమ్మెల్యే వివేక్‌వెంకటస్వామి సోమవారం రాత్రి సందర్శించారు. కాలనీ వాసులతో మాట్లాడి సమస్యలు తెలుసుకున్నారు. ఈ సందర్భంగా వివేక్ మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా భారీ వర్షాలు కురుస్తున్నాయని, ప్రజలు అవసరమైతే తప్ప బయటకు రావొద్దని అన్నారు. వర్షాల కారణంగా రోడ్లు తెగిపోయి రాకపోకలు నిలిచాయని తెలియడంతో అధికారులతో మాట్లాడి మరమ్మతులు చేయించినట్లు తెలిపారు. వర్షాలు తగ్గుముఖం పట్టిన తర్వాత శాశ్వత రోడ్డు నిర్మాణానికి కృషి చేస్తానని చెప్పారు. మరో రెండు రోజులు భారీ వర్షాలు ఉండడంతో లోతట్టు ప్రాంతాల ప్రజలు ఎగువ ప్రాంతాలకు రావాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జెడ్పీ వైస్ చైర్మన్ మూల రాజిరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.



సమస్యలు తెలుసుకుంటున్న ఎమ్మెల్యే వివేక్

క్లుప్తంగా

కృష్ణ ఎక్స్‌ప్రెస్ రద్దు

ఆదిలాబాద్: భారీ వర్షాల నేపథ్యంలో ఆదిలాబాద్–తిరుపతి మధ్య నడిచే కృష్ణ ఎక్స్‌ప్రెస్ (17206) సర్వీసు రద్దు చేస్తున్నట్లు ద.మ రైల్వే ఓ ప్రకటనలో పేర్కొంది. మంగళవారం ఈ సర్వీసు రద్దు చేసినట్లు తెలిపింది. ఈ విషయాన్ని ప్రయాణికులు గమనించాలని కోరింది.

8 నుంచి డబ్ల్యూపీఎస్ వార్షిక క్రీడలు

రెబ్బెన: డబ్ల్యూపీఎస్ అండ్ జీఏ బెల్లంపల్లి ఏరియా డిపార్టుమెంటల్ అంతర్గత వార్షిక క్రీడాపోటీలను ఈనెల 8 నుంచి ప్రారంభిస్తున్నట్లు ఏరియా జీఎం శ్రీనివాస్ ఓ ప్రకటనలో తెలిపారు. 8న షటిల్ బ్యాడ్మింటన్, టేబుల్ టెన్నిస్, బాడీ బిల్డింగ్, పవర్, వెయిట్ లిఫ్టింగ్, 9న వాలీబాల్, 10న లాంగ్ టెన్నిస్, 12న బాస్కెట్ బాల్, 15న క్యారమ్స్, చెస్, కల్చరల్, 27న బాల్ బ్యాడ్మింటన్, 28న కబడ్డీ పోటీలు ఉంటాయని పేర్కొన్నారు. ఏరియాలో పని చేస్తున్న ఉద్యోగులందరూ ఈ క్రీడల్లో పాల్గొనాలని కోరారు.

వుషూ పోటీల్లో భారతికి గోల్డ్‌మెడల్



గోల్డ్‌మెడల్‌తో భారతి

రామకృష్ణాపూర్: అమెచ్యూర్ వుషూ అసోసియేషన్ ఆఫ్ మంచిర్యాల ఆధ్వర్యంలో క్యాతనపల్లిలోని ఎంఆర్ గార్డెన్స్‌లో ఆదివారం నిర్వహించిన వుషూ రాష్ట్ర స్థాయి చాంపియన్‌షిప్ పోటీల్లో మంచిర్యాలకు చెందిన వడ్లకొండ భారతి వుషూ నాన్‌కాన్ కటా విభాగంలో గోల్డ్‌మెడల్ సాధించింది. ఉత్తరఖండ్ రాష్ట్రంలోని డెహ్రాడూన్‌లో త్వరలో జరుగనున్న జాతీయస్థాయి పోటీల్లో భారతి పాల్గొననున్నట్లు నిర్వాహకులు తెలిపారు.

పిచ్చికుక్కల దాడిలో యువకుడికి గాయాలు

నెన్నెల: మండలంలోని జెండావెంకటాపూర్‌లో సోమవారం పిచ్చికుక్కల దాడిలో యువకుడు దుర్గం సునీల్‌కు తీవ్ర గాయాలయ్యాయి. కుటుంబ సభ్యులు తెలిపిన వివరాలు.. సునీల్ బైక్‌పై గ్రామంలోకి వస్తుండగా కుక్కల గుంపు కొట్లాడుకుంటూ వచ్చి బైక్‌కు తగిలాయి. సునీల్ కింద కాళ్లు పెట్టగా రెండు కుక్కలు అతని కాలిని గాయపర్చింది. అతడిని గ్రామస్తులు మంచిర్యాల ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.

కోడిపందేల స్థావరాలపై దాడి

చింతలమానెపల్లి: మండలంలోని ఆడెపల్లి శివారులో నిర్వహిస్తున్న కోడిపందేల స్థావరంపై సోమవారం పోలీసులు దాడులు నిర్వహించారు. 8 మందిని పట్టుకుని, వారి వద్ద నుంచి ఐదు కోడి పుంజులు, ఐదు కత్తులతోపాటు రూ.2120 నగదును స్వాధీనం చేసుకున్నామని ఎస్సై నరేశ్ తెలిపారు. ఈ మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై పేర్కొన్నారు.

నెన్నెల: మండలంలోని కోణంపేట శివారులో కోడిపందేల స్థావరంపై సోమవారం సాయంత్రం దాడి చేసినట్లు ఎస్సై ప్రసాద్ తెలిపారు. పక్కా సమాచారంతో మేరకు దాడి చేసి కోడి పందేలు కాస్తున్న 8 మందిని అరెస్టు చేశామన్నారు. రెండు పందెం కోళ్లు, రెండు కత్తులు, రూ.5 వేలు స్వాధీనం చేసుకున్నామని ఎస్సై తెలిపారు.

‘ఇన్‌స్పైర్’ చేయండి!

- బాల మేధావులకు చాన్స్!
- పోటీలకు దరఖాస్తుల ఆహ్వానం
- సెప్టెంబర్ 15 తుది గడువు
- ఉమ్మడి జిల్లాలో మంచిర్యాల ఫస్ట్
- ఆదిలాబాద్ జిల్లా లాస్ట్..

జిల్లా	పాఠశాల	లక్ష్యం	దరఖాస్తులు
మంచిర్యాల	280	1400	822
నిర్మల్	244	1220	274
కుమరంభీం	171	855	138
ఆదిలాబాద్	263	1315	19



జపాన్ సకురాకు ఎంపికైన విద్యార్థి ప్రాజెక్ట్‌ను పరిశీలిస్తున్న ప్రభుత్వ సలహాదారు అర్కల వేణుగోపాల్ (ఫైల్)

మంచిర్యాలఅర్బన్: చిట్టి బుర్రకు పదునుపెట్టి వినూత్న ఆలోచనలు చేసేలా, విద్యార్థుల్లో సృజనాత్మకత వెలికితీసేందుకు ప్రభుత్వం ‘ఇన్‌స్పైర్ మనక్’పేరిట విజ్ఞాన మేళా నిర్వహిస్తోంది. ఏటా కేంద్రశాస్త్ర సాంకేతిక మంత్రిత్వమండలి నేషనల్ ఇన్నోవేషన్ ఫౌండేషన్ సంయుక్తంగా ఇన్‌స్పైర్ మనక్ పేరిట ప్రతిపాదనలు పంపిస్తోంది. ఇన్‌స్పైర్ పోటీలకు 2024–25 విద్యా సంవత్సరానికి సెప్టెంబర్ 15 వరకు ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తులు ఆహ్వానిస్తోంది. ఉమ్మడి జిల్లాలోని ప్రభుత్వ, ప్రైవేట్, కస్తూర్బా, గురుకుల విద్యాలయాల్లో 6 నుంచి 10వ తరగతి చదువుతున్న విద్యార్థులు దరఖాస్తు చేసుకోవచ్చు. ప్రతి పాఠశాల నుంచి ఐదు ప్రాజెక్టులు పంపించాలి. ఇదిలా ఉంటే మంచిర్యాల జిల్లా 822 ప్రాజెక్టుల నమోదుతో మొదటి స్థానంలో నిలవగా, ఆదిలాబాద్ జిల్లా 19 దరఖాస్తులతో వెనకబడిపోయింది.

పాఠశాలకు ఐదు చొప్పున..

6 నుంచి 10వ తరగతి చదువుతున్న విద్యార్థులు ఇన్‌స్పైర్ పోటీలకు అర్హులు. ప్రతి పాఠశాల నుంచి తరగతి ఒకటి చొప్పున ఐదు ప్రాజెక్టులు తయారు చేయాలని డీఈవో ఆదేశాలు జారీ చేశారు. లక్ష్యానికి దూరంగా ఉండటంతో ఇటీవల హెచ్‌ఎంల సమావేశంలో ఈనెల 30లోగా ప్రాజెక్టులన్నీ అప్‌లోడ్ చేయాలని సూచించారు. విద్యార్థులు రూపొందించిన ప్రాజెక్టులను నిపుణులు పరిశీలించి జిల్లాస్థాయి ప్రదర్శనకు ఎంపిక చేస్తారు. ఇలా ఎంపికైన ఒక్కో ప్రాజెక్ట్‌కు రూ.10 వేల చొప్పున ప్రోత్సాహం విద్యార్థి బ్యాంకు ఖాతాలో జమచేస్తారు. ఈ విద్యా సంవత్సరం అక్టోబర్‌లో జిల్లాస్థాయి ఇన్‌స్పైర్ ప్రదర్శన ఉంటుంది. ప్రతిభ కనబర్చిన విద్యార్థి ప్రాజెక్టు రాష్ట్రస్థాయి, జాతీయ స్థాయికి ఎంపికచేస్తారు. రాష్ట్రస్థాయిలో ప్రతిభ చాటి జాతీయస్థాయికి ఎంపికైతే రూ.25 వేలు, అక్కడ ప్రతిభ చూపితే రాష్ట్రపతి భవన్, జపాన్ సందర్శనకు అవకాశం కల్పించే వీలుంది.

గత విద్యాసంవత్సరంలో..

2023–24 విద్యాసంవత్సరానికి మంచిర్యాల జిల్లా నుంచి 1235 ప్రాజెక్టుల నామినేషన్ నమోదు చేయగా 149 ఎంపికయ్యాయి. కుమరంభీం ఆసిఫాబాద్ జిల్లా 812 ప్రాజెక్టులకు గాను 108, నిర్మల్‌లో 1322 ప్రాజెక్టులకు గాను 125 ఎంపికయ్యాయి. ఆదిలాబాద్ జిల్లా 676 ప్రాజెక్టుల్లో 66 మాత్రమే ఎంపికై చివరి స్థానంలో నిలిచింది.

విద్యార్థులను ప్రోత్సహించాలి

2024–25 సంవత్సరానికి ఇన్‌స్పైర్ పోటీలకు విద్యార్థులు దరఖాస్తు చేసుకోవాలి. ఈనెల 15 వరకు తుది గడువు ఉంది. నిర్దేశిత లక్ష్యం చేరుకునేలా ఉపాధ్యాయులు విద్యార్థులను ప్రోత్సహించాలి. కొత్త ఆవిష్కరణలకు ప్రాధాన్యత ఇచ్చేలా చొరవ చూపాలి.– యాదయ్య, డీఈవో, మంచిర్యాల

ఖాళీలతో సంబంధం లేకుండా ప్రమోషన్లు కల్పించాలి



జీఎంకు వినతిపత్రం ఇస్తున్న ఏఐటీయూసీ నేతలు

రెబ్బెన(ఆసిఫాబాద్): సింగరేణిలో ఈపీ ఆపరేటర్లకు ఖాళీలతో సంబంధం లేకుండా పరీక్షలకు హాజరైన ఈపీ ఆపరేటర్లందరికీ ప్రమోషన్లు కల్పించాలని ఏఐటీయూసీ గోలేటి బ్రాంచి కార్యదర్శి ఎస్.తిరుపతి డిమాండ్ చేశారు. సోమవారం గోలేటి టౌన్‌షిప్‌లోని జీఎం కార్యాలయంలో జీఎం శ్రీనివాస్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈపీ ఆపరేటర్ల ప్రమోషన్ల విషయంలో యాజమాన్యం అన్యాయం చేసిందన్నారు. శ్రీరాంపూర్ నుంచి బెల్లంపల్లి ఏరియా వరకు తక్కువ మందికి ప్రమోషన్లు కల్పించిందన్నారు. ఏ, బీ, సీ గ్రేడ్ ప్రమోషన్ల కోసం పరీక్షలకు హాజరైన వారందరికీ ఖాళీలతో సంబంధం లేకుండా టైం బాండ్ ప్రకారం ప్రమోషన్లు కల్పించాలని అన్నారు. బ్రాంచి ఉపాధ్యక్షుడు బయ్యమొగిళి, ఆర్గనైజింగ్ కార్యదర్శి సముద్రాల ఆనంద్, ఫిట్ కార్యదర్శి మారం శ్రీనివాస్, నాయకులు రఘునాథ్‌రెడ్డి, పుట్ట అంజయ్య, ఈపీ ఆపరేటర్లు పాల్గొన్నారు.

ఇద్దరు గంజాయి విక్రేతల అరెస్టు



వివరాలు వెల్లడిస్తున్న సీఐ బన్సిలాల్

మంచిర్యాలక్రైం: జిల్లాకేంద్రంలో గంజాయి విక్రయించేందుకు వచ్చిన ఇద్దరిని అరెస్టు చేసినట్లు సీఐ బన్సిలాల్ తెలిపారు. స్థానిక పోలీసుస్టేషన్‌లో ఈ మేరకు సీఐ వివరాలు వెల్లడించారు. పక్కా సమాచారంతో సోమవారం స్థానిక గ్రీన్‌సిటీలో ఎస్సై సనత్‌కుమార్ నార్కోటిక్ టీమ్‌తో వెళ్లిన పోలీసు వాహనాన్ని చూసి ఇద్దరు పారిపోయేందుకు యత్నించగా పట్టుకున్నారు. మారుతినగర్‌కు చెందిన గోలివాడ సాయితేజ, మారుపల్లి సుకుమార్‌గా గుర్తించారు. వారి వద్ద నుంచి రూ.2 వేలు విలువ గల 35 గంజాయి ప్యాకెట్లు లభించాయి. మందమర్రి మండలం గద్దెరాగడికి చెందిన రాజు నుంచి గంజాయి కొనుగోలు చేసి అధిక ధరకు యువకులకు విక్రయించేందుకు వచ్చానని సాయితేజ ఒప్పుకున్నాడు. గంజాయిని స్వాధీనం చేసుకుని ఇద్దరిపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించినట్లు సీఐ తెలిపారు.

పలు రూట్లలో బస్సులు నిలిపివేత

ఆదిలాబాద్: భారీ వర్షాల నేపథ్యంలో ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలోని పలు ప్రాంతాల్లో ఆర్టీసీ బస్సులు సోమవారం తాత్కాలికంగా రద్దయ్యాయి. ఆదిలాబాద్ నుంచి ఒంగోలు, గుంటూరు వెళ్లే సర్వీసును ఖమ్మం వరకు మాత్రమే నడుపుతున్నట్లు ఆదిలాబాద్ ఆర్‌ఎం సోలోమన్ తెలిపారు. అదేవిధంగా మంచిర్యాల–జగిత్యాల మధ్య నడిచే 5 సర్వీసులు, భైంసా పరిధిలో ఓలా, నిగ్వా వంటి రూట్లలో తాత్కాలికంగా బస్సులు నిలిపివేసినట్లు పేర్కొన్నారు. ప్రయాణికులు గమనించాలని కోరారు.

పనిస్థలాలు పరిశీలించిన ఏఐటీయూసీ నేతలు



ఆర్కే 7 గనిలో దిగుతున్న నాయకులు

శ్రీరాంపూర్: గుర్తింపు సంఘం ఏఐటీయూసీ నాయకులు సోమవారం ఆర్కే 7 గనిలో దిగి పని స్థలాలను పరిశీలించారు. యూనియన్ బ్రాంచి సెక్రటరీ ఎస్కే బాజీసైదా, ఉపాధ్యక్షుడు కొట్టే కిషన్‌రావు తదితరులు గనిలోని 2ఏఎస్ సౌత్ ప్యానల్‌లో దిగి కార్మికుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. గనిలో వెంటిలేషన్ సమస్య ఉందని, సరిపడా గాలిని అందించాలని వారు నేతలకు తెలిపారు. అనంతరం ఏఐటీయూసీ నేతలు ఏజెంట్ రాముడు, మేనేజర్ తిరుపతిని కలిసి సమస్యలను వివరించారు. వెంటనే వెంటిలేషన్ మెరుగుపర్చాలన్నారు. గని జీవితకాలం పెరగాలంటే సౌత్ సైడ్ ఉన్న బొగ్గు నిక్షేపాలను వెలికితీయాలన్నారు. దీంతో మరో 15 ఏళ్ల వరకు గని కొనసాగుతుందన్నారు. దీనిపై యాజమాన్యం చర్యలు తీసుకోవాలని కోరారు. యూనియన్ బ్రాంచి సహాయ కార్యదర్శి ఎం.కొమురయ్య, ఫిట్ సెక్రెటరీ బీర రవీందర్, మైనింగ్ స్టాఫ్ నాయకులు పారుపల్లి రాజేందర్ తదితరులు ఉన్నారు.

35 శాతం లాభాల వాటా చెల్లించాలి



ఆర్కే 7 గని మేనేజర్‌కు వినతిపత్రం ఇస్తున్న సురేందర్‌రెడ్డి

శ్రీరాంపూర్: సింగరేణి గడిచిన ఆర్థిక సంవత్సరం సాధించిన వార్షిక లాభాలను వెంటనే ప్రకటించి, అందులో నుంచి 35 శాతం లాభాల వాటాను కార్మికులకు చెల్లించాలని టీబీజీకేఎస్ నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు ఆ యూనియన్ ఆధ్వర్యంలో అన్ని గనులపై నిరసనలు తెలిపి గని మేనేజర్లకు వినతిపత్రాలు అందజేశారు. ఆర్కే 7 గనిపై జరిగిన కార్యక్రమంలో టీబీజీకేఎస్ ప్రధాన కార్యదర్శి కేతిరెడ్డి సురేందర్‌రెడ్డి పాల్గొని మాట్లాడారు. వార్షిక సంవత్సరం ముగిసి 6 నెలలవుతున్నా ఇప్పటికీ కంపెనీ ఎంత లాభం వచ్చిందో ప్రకటించలేదన్నారు. విద్యాసంస్థలు ప్రారంభమైనందున కార్మికులకు ఖర్చులు అధికంగా ఉన్నాయని, వెంటనే లాభాలు ప్రకటించి వాటా చెల్లించాలని డిమాండ్ చేశారు. రాజునాయక్, బిరుదు శ్రీనివాస్, సిద్దం తిరుపతి, రాజలింగు ఉన్నారు. ఆర్కే 6 గనిపై జరిగిన కార్యక్రమంలో యూనియన్ చీఫ్ ఆర్గనైజింగ్ సెక్రటరీ పొగాకు రమేశ్, సెంట్రల్ ఆర్గనైజింగ్ సెక్రటరీ అన్వేష్‌రెడ్డి, నాయకులు పానుగంటి సత్తయ్య, రాంటెంకి మల్లయ్య, ఎస్సార్పీ 3, 3ఏ గనిపై వద్ద యూనియన్ నాయకులు గోపి నాయక్, సాధుల భాస్కర్, వెంకటరెడ్డి, సతీశ్, రాజేశం పాల్గొన్నారు.

నిబంధనలకు అనుగుణంగా పనిచేయాలి



డ్రైవర్లతో మాట్లాడుతున్న ఇన్‌చార్జి జీఎం శ్రీనివాస్

శ్రీరాంపూర్: కంపెనీలో కాంట్రాక్ట్ కన్వేయన్స్ డ్రైవర్లు సంస్థ నిబంధనల మేరకు పనిచేయాలని శ్రీరాంపూర్ ఇన్‌చార్జి జీఎం టి.శ్రీనివాస్ తెలిపారు. డ్రైవర్లు వారి డిమాండ్ల సాధన కోసం ఇటీవల యాజమాన్యానికి సమ్మె నోటీసు అందించారు. సోమవారం జీఎం కార్యాలయంలో వారితో జీఎం సమీక్ష సమావేశం నిర్వహించారు. డ్రైవర్లకు నిబంధనల మేరకు వేతనాలు చెల్లించాలన్నారు. కంపెనీ నియమాల ప్రకారం సీఎంపీఎఫ్ చెల్లించాలని పేర్కొన్నారు. పని గంటల సమస్యలపై త్వరలో చర్చించి పరిష్కరిస్తామన్నారు. ఏరియా ఎస్‌ఓటూ జీఎం ఎం.సత్యనారాయణ, ఏజీఎం ఫైనాన్స్ మురళీధర్, డీజీఎం పర్సనల్ అరవిందరావు, పర్చేజ్ అధికారి చంద్రశేఖర్, ఏజెంట్ శ్రీధర్, క్వాలిటీ మేనేజర్ వెంకటేశ్వర్‌రెడ్డి, సెక్యూరిటీ అధికారి మురళీమోహన్, డిప్యూటీ పర్సనల్ మేనేజర్ దేవేందర్‌రెడ్డి పాల్గొన్నారు.

ఏరియాలో 76 శాతం బొగ్గు ఉత్పత్తి

- ఆర్కే ఓసీలో 162శాతం.. శాంతిఖనిలో 48శాతం బొగ్గు ఉత్పత్తి



వివరాలు వెల్లడిస్తున్న జీఎం దేవేందర్

మందమర్రిరూరల్: మందమర్రి ఏరియాలో గత నెల 76శాతం బొగ్గు ఉత్పత్తి జరిగిందని ఏరియా జీఎం దేవేందర్ తెలిపారు. జీఎం ఆఫీస్ ఆవరణలోని కాన్ఫరెన్స్ హాల్లో సోమవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఉత్పత్తి వివరాలు వెల్లడించారు. కేకే–5 గనిలో 13,165టన్నులు, కాసిపేట గనిలో 13,355 టన్నులు, కాసిపేట–2 గనిలో 9,779టన్నులు, శాంతిఖనిలో 4,814టన్నులు, కేకే–ఓసీలో 72,810టన్నులు, ఆర్కే ఓసీలో 76,085టన్నుల ఉత్పత్తి జరిగిందని పేర్కొన్నారు. ఏరియాలో గైర్హాజరు ఉద్యోగులు ఎక్కువగా ఉన్నారని, వారు విధులు సక్రమంగా నిర్వహించాలని సూచించారు. రక్షణ సూత్రాలు పాటిస్తూ ఏరియా ఉద్యోగులంతా సమష్టిగా కృషి చేయాలని కోరారు. సమావేశంలో ఎస్వోటు జీఎం రాజేశ్వర్‌రెడ్డి, డీజీఎం వెంకటరమణ, ఐఈడీ రాజన్న, ఇన్‌చార్జి పీఎం మైత్రేయబంధు తదితరులు ఉన్నారు.

రైల్వేకాలనీలో వరదనీరు నిల్వకుండా చర్యలు

బెల్లంపల్లి: బెల్లంపల్లి కాల్‌టెక్స్ ఏరియా రైల్వే కాలనీ సమీపంలో వరద నీరు నిల్వకుండా సోమవారం చర్యలు తీసుకున్నారు. భారీ వర్షాలకు తోడు జాతి కుంట నుంచి వరదనీరు వస్తుండటంతో లోతట్టు ప్రాంతంలో నీరు నిలిచి పరిసర ప్రాంతాల ఇళ్లలోకి వెళ్తుండటంతో కట్టడి చర్యలకు ఉపక్రమించారు. ఆర్డీవో హరికృష్ణ, మున్సిపల్ కమిషనర్ శ్రీనివాసరావుతో కలిసి మున్సిపల్ చైర్ పర్సన్ శ్వేత రైల్వే అధికారులు, సిబ్బందితో మాట్లాడారు. జాతి కుంట చెరువు నుంచి వరద ప్రవాహం రాకుండా నీటి మళ్లింపు చర్యలు తీసుకోవాలని సూచించారు. జేసీబీతో తాత్కాలింగా వరదనీరు వెళ్లేలా చర్యలు తీసుకున్నారు. తహసీల్దార్ జ్యోత్స్న, మాజీ కౌన్సిలర్ నెల్లి రమేశ్, అధికారులు, బస్తీవాసులు పాల్గొన్నారు.

ఎందుకు బిడ్డా..ఇంతపని చేసుకున్నరు..!

- పండుగకు వస్తరని కొత్త బట్టలు తెచ్చిన..
- తల్లిదండ్రుల రోదనలు వర్ణనాతీతం
- కన్నీటి మధ్య ముగిసిన అంత్యక్రియలు
- మృతుల కుటుంబానికి మాజీ ఎమ్మెల్యే పరామర్శ



వెంకటేష్ తల్లి రాజేశ్వరిని ఓదార్చుతున్న మాజీ ఎమ్మెల్యే దివాకర్‌రావు



మృతదేహాల వద్ద రోదిస్తున్న కుటుంబ సభ్యులు, బంధువులు

మంచిర్యాలక్రైం: ‘‘ఎందుకు బిడ్డా ఇంత పని చేసుకున్నరు.. మేమున్నం. ఎన్ని అప్పులున్నా తీర్చుకుందామని చెప్పితిమి కదా.. బిడ్డా పిల్లలు ఏం పాపం చేశారు. ఎందుకిలా చేశావు..’’ అంటూ ఆ తల్లి రోదించిన రాజేశ్వరి తీరు కాలనీ వాసులను కంటతడి పెట్టించింది. మంచిర్యాల పట్టణంలోని రెడ్డి కాలనీకి చెందిన సింగరేణి రిటైర్డు ఉద్యోగి ఇప్ప కొమురయ్య, రాజేశ్వరి దంపతుల కుమారుడు వెంకటేష్ ఆన్‌లైన్ బెట్టింగ్‌తో అప్పుల పాలు కావడం, వెంకటేష్ శనివారం రాత్రి తన భార్య, ఇద్దరు పిల్లలకు విషమించి తానూ ఆత్మహత్య చేసుకోవడం తెలిసిందే. వెంకటేష్, అతడి భార్య వర్షిణి, కుమారులు రిషికాంత్(11), విహాంత్(3) మృతదేహాలు సోమవారం ఉదయం మంచిర్యాలలోని ఇంటికి తీసుకొచ్చారు. ఇంటి ఎదుట నలుగురి మృతదేహాలను వరుసగా ఉంచిన తీరుతో స్థానికులు కంటతడి పెట్టారు. చివరి చూపు కోసం బంధువులు, కాలనీ ప్రజలు అధిక సంఖ్యలో తరలివచ్చారు. కాలనీ మొత్తం విషాదఛాయలు అలుముకున్నాయి. ‘‘గణేష్ పండుగకు వస్తరని కొత్త బట్టలు తెచ్చిన బిడ్డా..’’ అంటూ వర్షిణి తల్లి పద్మ రోదించిన తీరు అక్కడున్నవారిని ఆవేదనకు గురి చేసింది. మాజీ ఎమ్మెల్యే నడిపెల్లి దివాకర్‌రావు, బీఆర్‌ఎస్ నాయకులు, స్థానిక కాంగ్రెస్ కౌన్సిలర్ సంజీవ్.. మృతుల కుటుంబ సభ్యులను పరామర్శించారు.

అంత్యక్రియలకు ఆటంకం

మంచిర్యాల పట్టణంలో ఎవరు చనిపోయినా అంత్యక్రియలకు గోదావరి నదీ తీరంలోనే నిర్వహిస్తారు. ఇటీవల కురిసిన భారీ వర్షానికి నది ఉధృతంగా ప్రవహిస్తుండడంతో అంత్యక్రియలకు స్థలం లేకుండా పోయింది. దీంతో అండాలమ్మ కాలనీ సమీపంలో నూతనంగా ఏర్పాటు చేసిన శ్మశాన వాటికలో అంత్యక్రియలు నిర్వహించారు.

మద్యం షాపులో చోరీ



షాప్‌ను పరిశీలిస్తున్న సీఐ సుధాకర్

కోటపల్లి: మండలంలోని పార్‌పల్లి గ్రామంలోని మద్యం షాపులో గుర్తుతెలియని వ్యక్తులు ఆదివారం అర్ధరాత్రి చోరీకి పాల్పడ్డారు. సోమవారం ఉదయం అటుగా వెళ్తున్న వారు చూసి నిర్వాహకులకు సమాచారం అందించారు. వారు వచ్చి చూడగా షాపు వెనుక భాగాన తలుపు పగులగొట్టి ఉంది. షాపులో రూ.1.50 లక్షల విలువ గల మద్యం బాటిళ్లు, కౌంటర్‌లో రూ.34 వేల నగదును దొంగలు ఎత్తుకెళ్లారని నిర్వాహకులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఘటన స్థలాన్ని సీఐ సుధాకర్, ఎస్సై రాజేందర్ పరిశీలించారు. షాపులో సీసీ కెమెరాలు ధ్వంసం చేసి రికార్డు చేసే బాక్స్ ఎత్తుకెళ్లినట్లు గుర్తించారు. నిందితులు షాప్ వద్దకు ఆటోలో మద్యం బాటిళ్లతో ఉడాయించినట్లు ఆనవాళ్లు గుర్తించగా జాతీయ రహదారిపై ఏర్పాటు చేసిన సీసీ కెమెరాలను పరిశీలించారు. అనుమానితుడిని అదుపులో తీసుకున్నట్లు సమాచారం.

కులగణన కోసం ఒకరోజు దీక్ష



పోలీస్‌స్టేషన్‌లో దీక్ష చేస్తున్న శంకర్

లక్సెట్టిపేట: బీసీ రిజర్వేషన్ కులగణన చేపట్టాలని బీసీ జేఏసీ రాష్ట్ర కన్వీనర్ హనుమాండ్ల శంకర్ సోమవారం ఒకరోజు దీక్ష చేపట్టాడు. స్థానిక అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి తెలంగాణ తల్లి, ఐలమ్మ విగ్రహాలకు పూలమాలలు వేసి దీక్ష ప్రారంభించారు. స్థానిక పోలీస్‌స్టేషన్‌లో సాయంత్రం వరకు దీక్షలో కూర్చున్నారు. పలువురు నాయకులు ఆయనకు సంఘీభావం తెలిపారు.

ముగిసిన ఖేల్‌ఖూద్ పోటీలు



విజేతలకు బహుమతులు అందజేస్తున్న అతిథులు

మంచిర్యాలరూరల్(హాజీపూర్): హాజీపూర్ మండలం కర్ణమామిడి గ్రామం చొక్కారాంనగర్ రాంపూర్ శ్రీవిద్యారణ్య ఆవాస విద్యాలయంలో మూడు రోజులపాటు నిర్వహించిన ప్రాంత స్థాయి (రాష్ట్ర స్థాయి) క్రీడా పోటీలు సోమవారం ఘనంగా ముగిశాయి. ముఖ్య అతిథిగా హాజరైన విద్యా భారతీ దక్షిణ మధ్య క్షేత్ర అధ్యక్షుడు డాక్టర్ చామర్తి ఉమామహేశ్వర్‌రావు మట్లాడుతూ సరస్వతీ శిశు మందిరాలు విద్యార్థులు చదువుల్లోనే కాకుండా క్రీడల్లోనూ రాణించేలా చక్కని ప్రోత్సాహాన్ని ఇస్తున్నాయని అన్నారు. పోటీల్లో గెలుపోటములు సహజమని, క్రీడాకారులుగా నిరంతరం సాధన చేస్తేనే భవిష్యత్‌లో క్రీడల్లో అభ్యున్నతి సాధిస్తారని తెలిపారు. విజేతలకు పతకాలు, ప్రశంసాపత్రాలు అందజేశారు. ముగింపు వేడుకల్లో లక్సెట్టిపేట మున్సిపల్ చైర్మన్ నలమాసు కాంతయ్య, రాంపూర్ ఆవాస విద్యాలయం పూర్వ విద్యార్థి పరిషత్ ఉపాధ్యక్షుడు పూస్కూరి శ్రీనివాసరావు, గౌరవ కార్యదర్శి సాగి ప్రభాకర్‌రావు, శ్రీసరస్వతీ విద్యాపీఠం తెలంగాణ సంఘటనా కార్యదర్శి పతకమూరి శ్రీనివాసరావు, మంచిర్యాల విభాగ్ అధ్యక్షుడు డాక్టర్ కే.విష్ణువర్ధన్‌రావు, ఖేల్‌ఖూద్ ప్రబంధకులు పాల్గొన్నారు. కాగా రాష్ట్ర స్థాయి పోటీల్లో విజయం సాధించిన క్రీడాకారులు త్వరలో కర్ణాటకలో జరిగే క్షేత్ర(జాతీయ) స్థాయి క్రీడా పోటీల్లో పాల్గొంటారని నిర్వాహకులు తెలిపారు.

‘అడ’ 5, ‘వట్టి’ 3 ప్రాజెక్టుల గేట్లు ఎత్తివేత



అడ ప్రాజెక్టు నుంచి దిగువకు వెళ్తున్న నీరు

ఆసిఫాబాద్‌రూరల్: అడ, వట్టివాగు ప్రాజెక్టుల గేట్లు ఎత్తి అధికారులు సోమవారం నీటిని దిగువకు వదులుతున్నారు. రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలకు నీరు చేరడంతో అడ ప్రాజెక్టు ఐదు గేట్లు 1 మీటర్‌పై ఎత్తి 10,485 క్యూసెక్కుల నీటిని దిగువకు వదిలారు. పూర్తిస్థాయి నీటిమట్టం 10.393 టీఎంసీలు (243 మీటర్లు) కాగా, ప్రస్తుతం 5.809 టీఎంసీలు వాటర్ లెవల్ 237.450 మీటర్లుగా ఉంది. ప్రాజెక్ట్‌కు ఇన్ ఫ్లో ద్వారా 12580 క్యూసెక్కులు కాగా ఐదు గేట్లు ఎత్తి 10,485 నీటిని వదిలారు. వట్టివాగు ప్రాజెక్టు మూడు గేట్లు 2.80 మీటర్‌పై ఎత్తి 10,080 క్యూసెక్కుల నీటిని దిగువకు వదిలారు. ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటిమట్టం 2.89 టీఎంసీలు (238.50 మీటర్లు) ప్రస్తుతం 2.442 టీఎంసీలు కాగా, ఇన్ ఫ్లో ద్వారా వచ్చిన 5470 క్యూసెక్కులు నీటిని దిగువకు వదులుతున్నారు.